ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com
# కాకతీయ
మంగళవారం, 20 అక్టోబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 59 | పేజీలు: 4 వెల: 5

## ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల పరిస్థితేంటి?

- నిధుల వినియోగాన్ని వేగవంతం చేయాలి
- ఖర్చులో వెనుకబడిన శాఖలపై ప్రత్యేక సమీక్ష చేపట్టాలి
- ఆదాయ వనరుల సమీకరణకు కార్యాచరణ ప్రణాళిక
- రుణాల పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారించాలి
- అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధుల సద్వినియోగం
- ఆర్థిక నిర్వహణలో నిపుణుల సలహాలు తీసుకోవాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



2

# కన్నెపల్లిలో కాఫర్ డ్యామ్ కట్టాలి

## ప్రాణహిత నీటిని మళ్లించాలి!




- నవంబర్‌లోగా నిర్మించకుంటే పంప్‌హౌస్ వద్ద ఆందోళన
- నవంబర్ వరకు రైతులకు నీళ్లు, కరెంటు ఇవ్వాలి
- రూ.25 కోట్లతో నెలన్నరలోనే నిర్మాణం పూర్తి చేయొచ్చు
- మేడిగడ్డను బూచిగా చూపి రైతులకు అన్యాయం చేయొద్దు
- ప్రశ్నించడమే కాదు.. పరిష్కార మార్గాలూ చూపిస్తున్నాం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కొని రైతుల పంటలను కాపాడాలంటే కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద 93 మీటర్ల ఎత్తులో కాఫర్ డ్యామ్ నిర్మించి ప్రాణహిత నీటిని మళ్లించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవలం రూ.25 కోట్లతో నెలన్నర రోజుల్లోనే నిర్మాణం పూర్తి చేయవచ్చని తెలిపారు. నవంబర్ నెలాఖరులోగా పనులు చేపట్టకపోతే కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. మేడిగడ్డను సాకుగా చూపి రైతులకు నష్టం కలిగిస్తే సహించబోమని స్పష్టం చేశారు. సోమవారం టీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత.. ప్రాణహిత నది ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కాఫర్ డ్యామ్ నిర్మాణానికి అనువైన ప్రాంతం, దాని నిర్మాణంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కరువు పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు నిపుణులతో చర్చించి, అధ్యయనం చేసిన తర్వాతే ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చామని చెప్పారు. నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక వివరాలను కూడా ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు.

**నవంబర్ నెలాఖరులోగా నిర్మించాలి**

ప్రాణహిత నదిలో కరువు పరిస్థితుల్లోనూ రోజుకు రెండు టీఎంసీల నీరు ప్రవహిస్తుంటుందని కవిత పేర్కొన్నారు. ఈ నీటిని సద్వినియోగం చేసుకుంటే రైతులకు మేలు చేయవచ్చన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కాఫర్ డ్యామ్ నిర్మాణం చేపట్టి నీటిని మళ్లించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నవంబర్ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని రైతుల తరపున విజ్ఞప్తి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం

........(తరువాయి 2లో)

# మెటా అల్గారిథమ్‌లపై కేంద్రం కొరడా!

## ఒకే తరహా కథనాలకే ప్రాధాన్యం ఇవ్వొద్దు

**పాత వీడియోలు, ఫొటోల వెనుక వాస్తవాలు వెల్లడించాలి**

**హింసను ప్రేరేపించే కంటెంట్‌పై నిఘా పెంచాలి**

**న్యూఢిల్లీ:** సోషల్ మీడియా వేదికలపై వార్తలు, వీడియోలు, ఇతర సమాచారాన్ని వినియోగదారులకు సిఫార్సు చేసే విధానాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటా తన కంటెంట్ సిఫార్సు, ర్యాంకింగ్ వ్యవస్థలను సమీక్షించాలని ఆదేశించింది. ఒకే తరహా కథనాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వకుండా, విశ్వసనీయ సమాచారంలోని విభిన్న కోణాలు వినియోగదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు అక్టోబర్ 10న కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మెటాకు అడ్వైజరీ జారీ చేసింది. ఫొటోలు, వీడియోలు, గ్రాఫిక్స్‌ను ప్రదర్శించేటప్పుడు వాటి నేపథ్యాన్ని స్పష్టంగా తెలియజేయాలని కేంద్రం పేర్కొంది. అవి




ఎప్పుడు, ఎక్కడ చిత్రీకరించారో, ప్రస్తుత ఘటనలకు సంబంధం ఉందో లేదో వినియోగదారులకు అర్థమయ్యేలా వివరాలు అందించాలని సూచించింది. పాత వీడియోలను ప్రస్తుత ఘటనలుగా చూపడం, అత్యవసర పరిస్థితులు,

........(తరువాయి 2లో)



## తనూజ రంజన్ హత్య కేసులో కీలక మలుపు!

- నేపాల్‌లో ప్రధాన నిందితురాలి ఆచూకీ
- విశ్రాంత ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసులో పోలీసుల పురోగతి
- దోచుకున్న నగలు, కుట్ర వెనుక ఇతరుల పాత్రపై దర్యాప్తు
- ఆరు నెలలుగా కొనసాగుతున్న గాలింపు చర్యలు

3









# కన్నెపల్లిలో కాఫర్ డ్యామ్ కట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

తమ సూచనలను నిపుణులతో పరిశీలించాలని, ప్రతిపాదనలో సాంకేతికంగా ఏవైనా మార్పులు అవసరమైతే వాటిని అంగీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని కవిత తెలిపారు. తమ లక్ష్యం రాజకీయ ప్రయోజనం కాదని, రైతులకు నష్టం జరగకుండా చూడటమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

**ప్రశ్నించడమే కాదు.. పరిష్కారమూ చూపిస్తాం**

ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ప్రజల తరఫున పోరాడటంతోపాటు సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించడం కూడా తమ బాధ్యతేనని కవిత అన్నారు. రెండు రోజులు హడావుడి చేసి వెళ్లిపోవడం తమ ఉద్దేశం కాదని, కరువు నుంచి బయటపడేందుకు నిపుణులతో చర్చించిన తర్వాతే కాఫర్ డ్యామ్ ప్రతిపాదనను తెచ్చామని వివరించారు. రాష్ట్రంలో నవంబర్ వరకు రైతులకు నీళ్లు, కరెంటు అందించాలని డిమాండ్ చేశారు. పంటలను కాపాడేందుకు ఉచిత విద్యుత్ సరఫరాను నవంబర్ వరకు కొనసాగించాలని తాము ముందుగానే కోరినట్లు గుర్తుచేశారు. తమ డిమాండ్ తర్వాతే ముఖ్యమంత్రి కేంద్రం నుంచి విద్యుత్ కోరుతామని ప్రకటించారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు కోటి పది లక్షల ఎకరాల పంటలకు నీళ్లు, కరెంటు అవసరమని పేర్కొన్నారు. నవంబర్ చివరి వరకు సాగునీరు, విద్యుత్ అందించి పంటలను కాపాడాలని కోరారు.



ప్రభుత్వం వద్ద నీళ్లు, కరెంటు అందించే అవకాశాలున్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. ఈ విషయాన్ని రైతులకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 'ప్రశ్నించు.. పోరాడు.. పరిష్కరించు' అనే నినాదంతో తమ పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు.

**తెలంగాణ వచ్చాకా నీటి న్యాయం జరగలేదు**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 13 ఏళ్లు గడుస్తున్నా, రాష్ట్రానికి దక్కాల్సిన నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నామని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. 'మా నీళ్లు మాకే' అనే నినాదంతోనే తెలంగాణ ఉద్యమం సాగిందని గుర్తుచేశారు. గోదావరి, కృష్ణా నదుల జలాలను సమర్థంగా వినియోగించుకుంటే రాష్ట్రంలో కరువు పరిస్థితులు తలెత్తే అవకాశం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొంటూ, కృష్ణా పరివాహకంలో నాలుగు నుంచి ఐదు లక్షల ఎకరాలకు, గోదావరి పరివాహకంలో లక్ష ఎకరాలకు కొత్తగా నీటిని అందించామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.93 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ, పాత ఆయకట్టు స్థిరీకరణ, వరద ప్రవాహాన్ని వినియోగించుకోవడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టామని చెప్పారు. కాళేశ్వరం కాలువలను పూర్తిచేయడానికి మరో రూ.50 వేల కోట్లు అవసరమవుతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మరింత దిగజారిందని కవిత విమర్శించారు. రూ.26 వేల కోట్లు ఖర్చు చేసినా పనుల్లో చెప్పుకోదగ్గ పురోగతి లేదని ఆరోపించారు. పాత బకాయిలు చెల్లించామని ప్రభుత్వం చెబుతోందని, అదే సమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, దళితబంధు వంటి పథకాల బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు.

**మేడిగడ్డ పనులు కూడా పూర్తి చేయాలి**

మేడిగడ్డ బ్యారేజీని బూచిగా చూపి రైతులకు అన్యాయం చేయవద్దని కవిత ప్రభుత్వాన్ని కోరారు. కాఫర్ డ్యామ్ నిర్మాణంతోపాటు మేడిగడ్డ బ్యారేజీ పనులను కూడా పూర్తి చేసేందుకు ఇదే సరైన సమయమని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 21 వేల చెరువులు ఎండిపోయాయని, దీంతో రైతులు, ముదిరాజ్‌లు, బెస్త సామాజిక వర్గాలకు చెందిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రానున్న పది నెలల్లో పరిస్థితులు మరింత కఠినంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల కరువు తీవ్రత పెరిగే వరకు వేచి చూడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కాఫర్ డ్యామ్ ప్రతిపాదనను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలించి, అవసరమైన సాంకేతిక పరీక్షల అనంతరం పనులు ప్రారంభించాలని కోరారు.

**చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేయాలి**

మంథని నియోజకవర్గంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని కవిత డిమాండ్ చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు స్థానిక ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ప్రాజెక్టు విషయంలో ఎందుకు ముందడుగు పడటం లేదని ప్రశ్నించారు. ప్రాజెక్టుల కారణంగా ముంపునకు గురైన బాధితులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు నీటిని అందుబాటులో ఉన్న వనరుల నుంచి సద్వినియోగం చేసుకోవాలని, రైతులకు సాగునీరు, విద్యుత్ అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదని కవిత స్పష్టం చేశారు. కాఫర్ డ్యామ్ నిర్మాణంపై ప్రభుత్వం నవంబర్ నెలాఖరులోగా నిర్ణయం తీసుకోకపోతే కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేపడతామని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బోడ జనార్దన్, పార్టీ సీనియర్ నాయకులు రియాజ్ అహ్మద్, ఇస్మాయిల్, నవీన్‌కుమార్, రవిచంద్ర, వెంకట్, నరేశ్ నేత తదితరులు పాల్గొన్నారు.

# టీవీకేకు మంత్రుల నుంచే 99 శాతం విరాళాలు!

- విజయ్ పార్టీకి నలుగురు దాతల నుంచి రూ.13.3 కోట్లు
- ఆధవ్ అర్జున రూ.8.2 కోట్లు.. రంజిత్ కుమార్ రూ.5 కోట్లు
- అన్నాడీఎంకే, డీఎంకేలకు భారీగా నిధులిచ్చిన టైగర్ అసోసియేట్స్



**చెన్నై :** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు 2025-26 ఆర్థిక సంవత్సరంలో నలుగురు దాతల నుంచి రూ.13.3 కోట్ల విరాళాలు అందాయి. వీటిలో సుమారు 99 శాతం నిధులను ఆ పార్టీకి చెందిన ఇద్దరు మంత్రులే సమకూర్చారు. ఎన్నికల సంఘానికి పార్టీ సమర్పించిన నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. తమిళనాడు క్రీడల శాఖ మంత్రి ఆధవ్ అర్జున రూ.8.2 కోట్ల విరాళం అందించారు. పార్టీకి వచ్చిన మొత్తం విరాళాల్లో ఆయన వాటానే సుమారు 60 శాతం. మరో మంత్రి ఆర్వీ రంజిత్ కుమార్ రూ.5 కోట్లు ఇచ్చారు. ఈ ఇద్దరి విరాళాల మొత్తం రూ.13.2 కోట్లు కాగా, మిగిలిన రూ.10 లక్షలను మరో ఇద్దరు దాతలు అందించారు. తూత్తుకుడి లయన్స్ టౌన్ చిరునామాతో నమోదైన స్నో షో, స్నో ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ సంస్థలు డిమాండ్ డ్రాఫ్ట్‌ల ద్వారా చెరో రూ.5 లక్షలు విరాళంగా ఇచ్చాయి.

**అన్నాడీఎంకేకు రూ.161 కోట్లు.. డీఎంకేకు రూ.91 కోట్లు**

ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం, 2025-26లో అన్నాడీఎంకేకు రూ.161.35 కోట్ల విరాళాలు అందాయి. ఇందులో టైగర్ అసోసియేట్స్ ఒక్కటే రూ.135 కోట్లు ఇచ్చింది. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సారథ్యంలోని డీఎంకేకు రూ.91.19 కోట్ల విరాళాలు వచ్చాయి. ఈ పార్టీకి కూడా టైగర్ అసోసియేట్స్ రూ.125 కోట్లు అందించినట్లు కథనంలో పేర్కొన్నారు. కోల్‌కతా కేంద్రంగా పనిచేసే టైగర్ అసోసియేట్స్‌కు లాటరీ వ్యాపారవేత్త శాంటియాగో మార్టిన్‌తో సంబంధాలున్నట్లు తమిళ మీడియాలో గతంలో కథనాలు వచ్చాయి. ఆ సంస్థ భాగస్వామి సుబ్బయ్యన్ నాగరాజన్‌కు మార్టిన్‌తో దీర్ఘకాలంగా వ్యాపార సంబంధాలు ఉన్నట్లు కూడా వార్తలు వెలువడ్డాయి. 2024 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేయడానికి ముందు మార్టిన్‌కు చెందిన ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ భారీగా ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసింది. ఆ బాండ్ల ద్వారా డీఎంకేకు పెద్ద మొత్తంలో విరాళాలు అందిన విషయం పథకం రద్దు తర్వాత వెలుగులోకి వచ్చింది.

**మార్టిన్ కుటుంబానికి టీవీకేతోనూ బంధం**

ఈ వ్యవహారంలో మరో ఆసక్తికర అంశం ఉంది. శాంటియాగో మార్టిన్ కుమార్తెను టీవీకే మంత్రి ఆధవ్ అర్జున వివాహం చేసుకున్నారు. దీంతో మార్టిన్ కుటుంబానికి టీవీకేతోనూ కుటుంబ సంబంధం ఉంది. అన్నాడీఎంకే, డీఎంకేలకు టైగర్ అసోసియేట్స్ ద్వారా భారీ విరాళాలు అందగా, టీవీకేకు మార్టిన్ కుటుంబంతో సంబంధమున్న మంత్రి నుంచి పెద్ద మొత్తంలో నిధులు రావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

# మెటా అల్గారిథమ్‌లపై కేంద్రం కొరడా!

(మొదటిపేజీ తరువాయి)

ఆంక్షలు, పోలీసుల చర్యలపై ధ్రువీకరించని సమాచారాన్ని ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో అపోహలు, ఆందోళనలు పెరిగే ప్రమాదం ఉందని పేర్కొంది.

**హింసను ప్రేరేపించే కంటెంట్‌పై నిఘా**

తప్పుదారి పట్టించేలా మార్పులు చేసిన లేదా అసలు సందర్భం నుంచి వేరు చేసి చూపించే కంటెంట్‌ను పదేపదే సిఫార్సు చేయకుండా చర్యలు తీసుకోవాలని కేంద్రం సూచించింది. హింసను ప్రేరేపించే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దారితీసే సమాచారాన్ని వేగంగా గుర్తించి, పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకునే వ్యవస్థలను బలోపేతం చేయాలని స్పష్టం చేసింది. ప్రజా కార్యక్రమాలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు, ప్రకటనలు, గ్రాఫిక్స్‌ను తగిన వివరణ లేకుండా విస్తృతంగా ప్రదర్శించడంపైనా ఆందోళన వ్యక్తం చేసింది.

**దిల్లీ నిరసనల వేళ అడ్వైజరీ**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ, ఇతర ప్రతిపక్ష పార్టీలు నిర్వహిస్తున్న నిరసనల నేపథ్యంలో కేంద్రం సూచనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా పలు చోట్ల ఆందోళనలు జరుగుతున్న సమయంలో మెటా అల్గారిథమ్‌లు కొన్నిరకాల కంటెంట్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయనే అంశం చర్చకు వచ్చినట్లు ఐటీ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. సమాచార సాంకేతిక చట్టం-2000, సమాచార సాంకేతిక నిబంధనలు-2021 ప్రకారం మెటా వ్యవహరించాలని కేంద్రం స్పష్టం చేసింది. పోలీసులు, ఇతర అధికారిక సంస్థలకు అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందించాలని సూచించింది. తక్షణమే చర్యలు చేపట్టి, వాటి వివరాలను మంత్రిత్వ శాఖకు తెలియజేయాలని కోరింది.

# 34 నెలల్లో 12.40 లక్షల పాస్‌బుక్కులు!

- భూవివాదాల శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- రీ-సర్వేతో సాగుదారులకు చట్టబద్ధమైన హక్కులు
- భూభారతితో ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం: మంత్రి పొంగులేటి



**కాకతీయ, హైదరాబాద్ :** ప్రజలకు పారదర్శక రెవెన్యూ సేవలు అందించడంతోపాటు రైతులకు చట్టబద్ధమైన భూ హక్కులు కల్పించడమే లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తమైందని, సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు దానిని బలోపేతం చేస్తూ ప్రజలకు చేరువ చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. భూభారతి చట్టం అమలు, పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ, భూముల రీసర్వే, భూ సమస్యల పరిష్కారంపై చర్చించారు. భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు 5,68,858 పాస్‌బుక్కులు జారీ చేసినట్లు తెలిపారు. అంతకుముందు 6,71,508 పాస్‌బుక్కులు అందించామని, మొత్తంగా 34 నెలల్లో 12,40,366 పాస్‌బుక్కులు పంపిణీ చేసినట్లు వివరించారు.

**రీ-సర్వేతో హక్కుల కల్పన**

దశాబ్దాలుగా భూములు సాగు చేస్తున్నప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో హక్కులు లేక ప్రభుత్వ పథకాలకు దూరమైన రైతులను గుర్తించి, చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తున్నామని పొంగులేటి తెలిపారు. భూభారతి చట్టం ప్రకారం రీసర్వే నిర్వహించి వాస్తవ సాగుదారుల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం రెవెన్యూ గ్రామంలో రీసర్వే ద్వారా గిరిజనులు, గిరిజనేతరుల సమస్యలను పరిష్కరించి 906 మంది రైతులకు 1,600 ఎకరాలకు పైగా భూమిపై హక్కులు కల్పించినట్లు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల మండలాల్లోని 15 గ్రామాల్లో 2,400 మంది రైతులకు 3,450 ఎకరాలకు పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. పాస్‌బుక్కుల ద్వారా రైతులకు బ్యాంకు రుణాలు, రైతు భరోసా, ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ములుగు జిల్లాలోని ముల్కాపల్లి మండలంతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, అశ్వారావుపేట, దమ్మపేట, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలాల్లో రీసర్వే పనులు వేగంగా సాగుతున్నాయని మంత్రి తెలిపారు. అక్కడి భూ సమస్యలను పరిష్కరించి త్వరలోనే హక్కుదారులకు పాస్‌బుక్కులు అందిస్తామని చెప్పారు. ఇదే విధానాన్ని ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేసి భూమిపై హక్కుల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారికి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజలకు మేలు జరిగేలా చర్యలు**

ప్రభుత్వం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలు, ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలైనప్పుడే ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని పొంగులేటి స్పష్టం చేశారు. జనగామ జిల్లాలో ఫుడ్ పార్క్ ఏర్పాటుపైనా ఆ జిల్లా కలెక్టర్‌తో చర్చించారు. సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల పరిస్థితేంటి..?

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగాన్ని వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఖర్చు చేయాలని, నిధుల వినియోగంలో వెనుకబడిన శాఖలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మరింత బలోపేతం చేసేందుకు ఆదాయ వనరుల సమీకరణ, ఆర్థిక సంస్కరణలు, రుణాల పునర్వ్యవస్థీకరణపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆర్థికశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భట్టి విక్రమార్క ఈ సూచనలు చేశారు. ఎస్సీ, ఎస్టీ ప్రగతి ఉప ప్రణాళిక అమలు, శాఖలవారీగా బడ్జెట్ కేటాయింపులు, ఇప్పటివరకు చేసిన ఖర్చు, రాష్ట్ర ఆర్థిక నిర్వహణకు సంబంధించిన అంశాలను సమీక్షించారు.

**నిధుల ఖర్చులో వెనుకబడిన శాఖలపై దృష్టి**

సాధారణ బడ్జెట్ కింద కేటాయించిన నిధులను వినియోగిస్తున్న తరహాలోనే ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక బడ్జెట్ కింద కేటాయించిన నిధులను కూడా చట్టబద్ధ నిబంధనలు, బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా పూర్తిస్థాయిలో వినియోగించాలని భట్టి విక్రమార్క సూచించారు. నిధుల ఖర్చులో ఉన్న లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బడ్జెట్ కేటాయింపులకు, వాస్తవ ఖర్చులకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించి, నిధుల వినియోగాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. ఖర్చులో వెనుకబడిన శాఖలతో ఆర్థికశాఖ అధికారులు ప్రత్యేక సమీక్షలు నిర్వహించాలని సూచించారు. నిధుల వినియోగంలో గణనీయమైన వ్యత్యాసాలు ఉన్న శాఖల కార్యదర్శులతో త్వరలో సమావేశాలు నిర్వహించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రాధాన్య శాఖలతో ప్రారంభించి వ్యవసాయం, వైద్యారోగ్యం, ఇంధనం, పురపాలక పరిపాలన, పంచాయతీరాజ్, సాంఘిక సంక్షేమం, పరిశ్రమలు, గిరిజన సంక్షేమ శాఖలపై సమీక్ష చేపట్టాలని సూచించారు. అనంతరం ఇతర శాఖల పనితీరును కూడా పరిశీలించాలని తెలిపారు. ప్రతి శాఖకు కేటాయించిన నిధులు, ఇప్పటివరకు చేసిన వ్యయం, మిగిలిన నిధులను సమర్థంగా వినియోగించేందుకు తీసుకోవాల్సిన చర్యలతో సమగ్ర నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ నివేదిక ఆధారంగా నిధుల వినియోగంలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు.

**ఆదాయ వనరుల సమీకరణకు ప్రణాళిక**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసేందుకు అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవడంతోపాటు అదనపు ఆదాయ మార్గాలను గుర్తించాలని భట్టి విక్రమార్క సూచించారు. వాస్తవ ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని బడ్జెట్ రూపకల్పన చేయాలని తెలిపారు. ఖర్చుల నియంత్రణ, నిధుల సమర్థ వినియోగం, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరుల లభ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఆర్థికశాఖ చేపడుతున్న సంస్కరణలు, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే చర్యలు, రుణాల పునర్వ్యవస్థీకరణ వ్యూహాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగా పటిష్ఠమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని తీసుకునే ఆర్థిక నిర్ణయాలు రాష్ట్రంలో స్థిరమైన ఆర్థిక వృద్ధికి దోహదపడాలని పేర్కొన్నారు.

**నిపుణుల సలహాలతో ఆర్థిక నిర్వహణ**

ఆర్థిక నిర్వహణలో అనుభవజ్ఞులైన సలహాదారులు, ఆర్థిక నిపుణుల సేవలను వినియోగించుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించేందుకు నిపుణుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. బడ్జెట్ కేటాయింపులు, నిధుల ఖర్చు, అభివృద్ధి కార్యక్రమాల అమలు మధ్య సమన్వయం ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. సంక్షేమ నిధులు అర్హులైన లబ్ధిదారులకు చేరడంతోపాటు రాష్ట్ర ఆర్థిక స్థిరత్వం దెబ్బతినకుండా చూడటం సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణలో కీలకమని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా ఆర్థిక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# ఎల్‌నినోపై సర్కారు ఫోకస్..

- భట్టి నేతృత్వంలో కేబినెట్ సబ్‌కమిటీ!
- సాగు, తాగునీరు, విద్యుత్ సమస్యలపై ప్రత్యేక సమీక్ష
- 235 మండలాల్లో వర్షా భావం.. 11.18 లక్షల ఎకరాల్లో పంట నష్టం అంచనా
- కరవు నివారణకు రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కోరిన ప్రభుత్వం

**కాకతీయ, హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరిలను సభ్యులుగా నియమించింది. సీఎం సలహాదారు రామకృష్ణారావు ప్రత్యేక ఆహ్వానితుడిగా, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సాగు, తాగునీరు, విద్యుత్, పశుగ్రాసం, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నిధుల నిర్వహణ వంటి అంశాలపై ఈ కమిటీ ఎప్పటికప్పుడు సమీక్షించి సూచనలు, ఆదేశాలు జారీ చేయనుంది. ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలతోపాటు ప్రజలు అనుసరించాల్సిన జాగ్రత్తలు, కేంద్రం నుంచి అందాల్సిన సహకారంపైనా చర్చించనుంది.

**11.18 లక్షల ఎకరాల్లో పంట నష్టం అంచనా**

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వివిధ శాఖల నుంచి నివేదికలను ప్రభుత్వం సేకరిస్తోంది. సుమారు 11.18 లక్షల ఎకరాల్లో పంటలు చేతికందే అవకాశం లేదని అంచనా వేస్తోంది. ప్రత్యామ్నాయ చర్యల అమలుపై దృష్టి సారించింది. రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు అధికారులు అంచనా వేయగా, సుమారు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నట్లు ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ వర్షాభావ పరిస్థితులపై విస్తృతంగా చర్చించారు. కరవు మండలాలను ప్రకటించడంతోపాటు తగిన ఆర్థిక సాయం అందించాలని కోరుతూ ప్రభుత్వం ఇప్పటికే శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్రానికి రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరింది. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. తాజాగా కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు ద్వారా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించి, అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

# 22ఏ పేరుతో కొండల్ రెడ్డి భూదందాలు

- రేవంత్ భూదందాలపై సీబీఐ విచారణ జరిపించాలి!
- సీఎం తనపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పాలి
- నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల వెనుక ఎవరున్నారు?
- తెలంగాణలో సీబీఐ విచారణకు సీఎం అనుమతి అవసరం
- కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పాలని, ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన వ్యవహారాలపై సీబీఐతో విచారణ జరిపించాలని కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ డిమాండ్ చేశారు. కొంతకాలంగా ఆధారాలతో ప్రశ్నిస్తున్నా సీఎం స్పందించడం లేదని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై బురదజల్లుతూ అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. కొండల్‌రెడ్డి కంపెనీకి భూమి కేటాయించారని, అమెరికాలో రేవంత్‌రెడ్డి తమ్ముడికి చెందిన స్వచ్ బయో కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారని క్రిశాంక్ ఆరోపించారు. గీతా హ్యుందాయ్ షోరూమ్‌ల ప్రారంభోత్సవాలపైనా ప్రశ్నలు లేవనెత్తారు. ఈ వ్యవహారాలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యుల పేర్లతో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూ లావాదేవీలపై సమగ్ర విచారణ జరగాలని అన్నారు. రాష్ట్రంలో ఫార్మా, ఆరోగ్య, రక్షణ, విద్య, కార్ల కంపెనీలతో పాటు భూముల వ్యవహారాల్లోనూ ప్రభుత్వం వివాదాలకు తావిస్తోందని విమర్శించారు. రెండున్నరేళ్లలో రేవంత్‌రెడ్డి కుటుంబం రూ.50 వేల కోట్లు దోచుకుందని ఆరోపించారు. ఈ ఆరోపణలకు సంబంధించి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**22ఏ పేరుతో నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లా?**

నిషేధిత భూముల జాబితాకు సంబంధించిన 22ఏ నిబంధన పేరుతో భూదందాలు జరుగుతున్నాయని క్రిశాంక్ ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా చందనవల్లిలోని సర్వే నంబరు 363లో ఉన్న లావణి పట్టా భూములకు సంబంధించి సర్వే నంబరు 363/3లోని నాలుగు ఎకరాలు రిజిస్ట్రేషన్ అయినట్లు పేర్కొన్నారు. కోతా శ్రీకాంత్‌రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ జరిగిందని, ఆర్9 కన్‌స్ట్రక్షన్స్ సంస్థ, మంచిరేవుల విల్లాలకు సంబంధించిన వ్యవహారాలపైనా ప్రశ్నలు లేవనెత్తారు. ఆర్9 కన్‌స్ట్రక్షన్స్ సంస్థ యజమాని రేవంత్‌రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి అని క్రిశాంక్ పేర్కొన్నారు. ఈ భూముల లావాదేవీలకు సంబంధించిన రికార్డులను బయటపెట్టాలని, నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయా లేదా అన్నది అధికారికంగా తేల్చాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి చిన్న తమ్ముడు కృష్ణారెడ్డి మరో అధికార కేంద్రంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేలను బెదిరించడంతోపాటు 22ఏ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

**సీబీఐ విచారణకు సీఎం అనుమతి ఇవ్వాలి**

తెలంగాణలో సీబీఐ విచారణ జరగాలంటే రాష్ట్ర ప్రభుత్వ అనుమతి అవసరమని క్రిశాంక్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రిపై వస్తున్న ఆరోపణలపై ఆయనే విచారణకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలపై విచారణ జరిపించడం లేదని విమర్శించారు. ఆరోపణలపై నిజానిజాలు తేల్చేందుకు స్వతంత్ర విచారణ జరగాలని అన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ అసైన్డ్ భూములున్నాయంటూ గతంలో దుష్ప్రచారం చేశారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి కుటుంబానికి సంబంధించిన భూముల వ్యవహారాలపై ప్రశ్నలు వస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఫామ్‌హౌస్‌ల వద్దకు వెళ్లి కాంగ్రెస్ నాయకులు ఏం సాధించారని ప్రశ్నించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ వల్ల ప్రజలకు ఏమైనా ఇబ్బందులు కలిగాయా అని నిలదీశారు.

ఎల్‌నినో ప్రభావంపై సమీక్షా సమావేశం నిర్వహించిన సమయంలో మంత్రులు పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నారని క్రిశాంక్ ఆరోపించారు. అక్టోబర్‌లో సమీక్ష నిర్వహించి రైతులు పంటలు వేయవద్దని చెబుతున్నారని విమర్శించారు. కరువు పరిస్థితులపై ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉండగా, రైతులపై ఆంక్షలు విధించడం ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లోకి నీళ్లు వస్తున్నాయని చెబుతున్నవారికి, రైతుల సమస్యలు ఎందుకు కనిపించడం లేదని వ్యాఖ్యానించారు.

**రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం**

తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం పడిపోయిందని, అయితే రేవంత్‌రెడ్డి కుటుంబానికి సంబంధించిన వ్యవహారాలు మాత్రం పెరిగాయని క్రిశాంక్ ఆరోపించారు. సిరిసిల్లలో రూ.100 కోట్లతో సభ నిర్వహించి కేటీఆర్‌కు హోటళ్లు ఉన్నాయని ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. ఇతరుల ఆస్తులపై ఆరోపణలు చేసే ముందు తనపై వస్తున్న ప్రశ్నలకు సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు సమాచారం ఇవ్వడం లేదని, బాధితులే తమకు వివరాలు అందిస్తున్నారని క్రిశాంక్ తెలిపారు. సమాచారం ఎవరి నుంచి వచ్చినా, దానిని పత్రాలు, రికార్డుల ఆధారంగా పరిశీలించి నిజానిజాలు వెలికితీయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. భూముల లావాదేవీలు, కంపెనీలకు కేటాయింపులు, నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి కుటుంబానికి సంబంధించిన వ్యవహారాలపై వస్తున్న ఆరోపణలకు సీఎం సమాధానం చెప్పాలని, అవసరమైన రికార్డులను ప్రజల ముందుంచాలని క్రిశాంక్ కోరారు. ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.





## పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా దసరా వేడుకలు

- ఆయుధ, జమ్మి, వాహన పూజల్లో పాల్గొన్న సీపీ గౌష్ ఆలం

**కాకతీయ, కరీంనగర్:** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా నిర్వహించిన ఆయుధ, జమ్మి, వాహన పూజల్లో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలోని ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బందికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు జానీమియా, శ్రీధర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా కురుమల ఐక్యత

- వరంగల్ విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి
- కురుమ సామాజిక వర్గం నేతల పిలుపు
- పీఏసీఎస్ చైర్మన్ ఎగితే లింగన్నకు ఘన సన్మానం



**కాకతీయ, వరంగల్ బ్యూరో:** రాజకీయాలకు అతీతంగా కురుమ సామాజిక వర్గమంతా ఐక్యంగా ఉండి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. దసరా నవరాత్రుల సందర్భంగా హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలం పెంచికలపేటలో కురుమ సామాజిక వర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన సభలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఎగితే లింగన్న కురుమను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, వ్యాపారులు, గ్రాడ్యుయేట్లు, గొర్రెల కాపరులు, మహిళలు, యువతతో పాటు వివిధ రంగాలకు చెందిన వందలాది మంది పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడిగా గుర్తింపు పొందిన దొడ్డి కొమురయ్య కురుమ త్యాగాలను భావితరాలకు గుర్తుండేలా వరంగల్ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలని సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, అమలు కోసం కృషి చేయాలని నిర్ణయించారు. కురుమ సామాజిక వర్గం విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, పేద కుటుంబాలకు అండగా నిలవడంతోపాటు విద్యార్థులను ఉన్నత చదువుల వైపు ప్రోత్సహించాలని నాయకులు సూచించారు. గ్రామ ఉపసర్పంచ్ చిట్టే రవి కురుమ, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంగరాజు కురుమ, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులను సత్కరించారు. కురుమ నాయకులకు రాజకీయ అవకాశాలు కల్పించిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. హనుమకొండ కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల భరత్‌కుమార్ కురుమ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కంచి ప్రభాకర్ కురుమ, దూడల మల్లన్న, బెల్లం బాలరాజు కురుమ, మంగ రాజన్న కురుమ, రాజా యూత్ సభ్యులు, సంఘం పెద్దలు, ఉద్యోగులు, యువత పాల్గొన్నారు.

## హైడ్రా చెరువుల చెంత బతుకమ్మ సందడి!

- అభివృద్ధి చేసిన చెరువుల వద్ద మహిళల ఆటపాటలు
- నీటితో నిండిన బేబీపాండ్‌లో బతుకమ్మల నిమజ్జనం



**కాకతీయ, హైదరాబాద్:** హైడ్రా అభివృద్ధి చేసిన చెరువులు బతుకమ్మ వేడుకలకు వేదికలుగా మారాయి. దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లి నల్లచెరువు, ఐడీఎల్ చెరువు, మాదాపూర్ సున్నం చెరువు, అంబర్‌పేట బతుకమ్మకుంట, ఉప్పల్ నల్లకుంట చెరువుల వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. కూకట్‌పల్లి నల్లచెరువులోని బేబీపాండ్‌ను నీటితో నింపడంతో మహిళలు బతుకమ్మలను అందులో నిమజ్జనం చేశారు. ఐడీఎల్ చెరువులో గణేశ్ నిమజ్జనాల కోసం ప్రత్యేకంగా తవ్విన చెరువు వైపు బతుకమ్మ ఆటలు ఉత్సాహంగా సాగాయి. అంబర్‌పేట బతుకమ్మకుంట, ఉప్పల్ నల్లకుంట చెరువుల వద్ద కూడా పండుగ సందడి కనిపించింది. కూకట్‌పల్లి నల్లచెరువు వద్ద హైడ్రా విపత్తు నిర్వహణ బృందం ఏర్పాట్లను పర్యవేక్షించడంతోపాటు మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేసేందుకు సహకరించింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక చెరువుల్లో నీరు తగ్గిన పరిస్థితుల్లో హైడ్రా అభివృద్ధి చేసిన చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయడం మహిళలకు ఊరటనిచ్చింది. గతంలో చెరువుల వద్ద బతుకమ్మ ఆడేందుకు అనువైన వాతావరణం ఉండేది కాదని, నిమజ్జనానికే పరిమితమయ్యేవారమని పలువురు మహిళలు పేర్కొన్నారు. ఇప్పుడు చెరువుల చెంత ఆటపాటలతో పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

## రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు

**టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ ఆకాంక్ష**

**కాకతీయ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ ఆకాంక్షించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రజల్లో ఐక్యత, సోదరభావం, సామాజిక సామరస్యాన్ని మరింత బలోపేతం చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తూ మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ.. సిట్‌తో విచారణ జరపాలి!

- రేవంత్ పాలనలో పోలీసులే గుండాలుగా ప్రవర్తిస్తున్నారు
- ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయరా?
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- బీఆర్ఎస్ నేత డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్



**కాకతీయ, సిరిసిల్ల :** జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై సిట్ ద్వారా నిష్పాక్షిక విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేత డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి పాలనలో పోలీసులే గుండాలుగా వ్యవహరిస్తూ నేరాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో బాధిత జర్నలిస్టులను పరామర్శించిన ఆయన, వారికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. గంభీరావుపేట మండలంలో భూ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకున్న అంశంపై ఏక్ ధమ్ న్యూస్ రిపోర్టర్లు కథనాలు ప్రచురించడంతో వారిపై అక్రమ కేసులు నమోదు చేశారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. గంభీరావుపేట ఎస్సై ఇద్దరు జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి హత్యాయత్నానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. గాయాలతోపాటు చేయి విరిగి బాధితులు భయాందోళనలకు గురయ్యారని తెలిపారు. జర్నలిస్టులు కరీంనగర్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ నేరం చేయకపోయినా కేసులు నమోదు చేసి, ఇంటి తలుపులు పగులగొట్టి అరెస్టులు చేసే పోలీసులు.. బాధితులుగా మారిన జర్నలిస్టులు ఫిర్యాదు చేస్తే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

**సామాన్యులకు ఒక న్యాయమా?**

సామాన్యులకు ఒక న్యాయం, రాజకీయ నాయకులకు మరో న్యాయమా? ఇదేనా ప్రజాపాలన? అని ప్రవీణ్ కుమార్ నిలదీశారు. డీజీపీ సీవీ ఆనంద్ ఈ ఘటనపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. డీకే బసు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతోపాటు న్యాయస్థానాలు నిర్దేశించిన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ పోలీసులు వాటిని పట్టించుకోకుండా జర్నలిస్టుల పట్ల కర్కశంగా వ్యవహరించారని విమర్శించారు. జర్నలిస్టులపై దాడి చేయాలని ఎస్సైకి ఎవరు ఆదేశాలిచ్చారో తేల్చాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. విచారణ నిష్పాక్షికంగా, పారదర్శకంగా జరగాలని, అవసరమైతే కేసును సీఐడీకి అప్పగించాలని లేదా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**జర్నలిస్టులకు అండగా బీఆర్ఎస్**

ఏక్ ధమ్ న్యూస్ రిపోర్టర్లు పదేళ్లుగా వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకు కృషి చేస్తున్నారని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఫర్ న్యూస్‌పేపర్స్ ఫర్ ఇండియా గుర్తింపు పొందిన పత్రికకు చెందిన జర్నలిస్టులపై దాడి చేయడం దుర్మార్గమని విమర్శించారు. గతంలో పోలీసుల చేతిలో కర్ల రాజేశ్ హత్యకు గురయ్యారని, ఇప్పుడు సిరిసిల్లలో మరో దళిత జర్నలిస్టుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆరోపించారు. దాడిలో జర్నలిస్టు ప్రాణాలు కోల్పోతే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా నిలిచి పోరాటం కొనసాగిస్తుందని ప్రకటించారు

## మిత్రుల జైలు జీవితం.. అభిజీత్ దిప్కే భావోద్వేగం!

- సౌకర్యవంతమైన జీవితాలను వదిలి ప్రజల కోసం పోరాటం
- జంతర్‌మంతర్ వద్ద జాతీయ జెండా ఎగరేసినందుకు అరెస్టు
- అశుతోష్, సౌరవ్ త్యాగాలను ఎక్స్‌లో పంచుకున్న కాక్రోచ్ పార్టీ నేత



**కాకతీయ, నేషనల్ డెస్క్ :** ప్రజల కోసం పోరాడుతూ జైలు పాలైన తన మిత్రులు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌ల త్యాగాలను గుర్తుచేసుకుంటూ కాక్రోచ్ జనతా పార్టీ జాతీయ కన్వీనర్ అభిజీత్ దిప్కే భావోద్వేగానికి గురయ్యారు. దేశాన్ని మెరుగైన ప్రదేశంగా మార్చాలనే ఆశతో వారు తమ సౌకర్యవంతమైన జీవితాలను వదిలి ప్రజా ఉద్యమంలోకి వచ్చారని ఎక్స్ వేదికగా చేసిన సుదీర్ఘ పోస్టులో పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాల క్రితం అశుతోష్ రాంకా లండన్‌లో అత్యధిక వేతనం వచ్చే కార్పొరేట్ ఉద్యోగంలో ఉండేవారని, లక్షలాది రూపాయలు సంపాదించేవారని దిప్కే గుర్తుచేశారు. సౌరవ్ దాస్ దేశ న్యాయవ్యవస్థ గురించి రచనలు చేస్తూ సౌకర్యవంతమైన జీవితాన్ని గడిపేవారని తెలిపారు. ఇద్దరికీ విజయవంతమైన వృత్తి జీవితాలు, ఆర్థిక భద్రత ఉన్నప్పటికీ వాటిని కొనసాగించకుండా ప్రజల కోసం పోరాటాన్ని ఎంచుకున్నారని పేర్కొన్నారు. వీధుల్లోకి వచ్చి అనిశ్చితిని ఎదుర్కొంటూ చివరకు జైలు పాలవ్వాల్సిన అవసరం వారికి లేదని, అయినా దేశం కోసం ఆ మార్గాన్ని ఎంచుకున్నారని అభిజీత్ దిప్కే వ్యాఖ్యానించారు.

**తెలియని వారి కోసం పోరాటం..**

తమకు అదృష్టం కలిసివచ్చినప్పటికీ, అలాంటి అవకాశం లేని వారి కోసం పోరాడాలని అశుతోష్, సౌరవ్ నిర్ణయించుకోవడం తనను ఆకట్టుకుందని దిప్కే తెలిపారు. ఇతరుల కష్టాలను పట్టించుకోకుండా తమ జీవితాలను ఆనందంగా గడిపే అవకాశం వారికీ ఉందన్నారు. ఎవరూ వారిని త్యాగాలు చేయాలని అడగలేదని, ఆశించలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ ఇతరుల పట్ల నిజమైన శ్రద్ధతో వారు ఉద్యమంలోకి వచ్చారని కొనియాడారు. నీట్ అక్రమాల నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీని దేశవ్యాప్త ఉద్యమంగా మార్చడంలో కీలక పాత్ర పోషించిన నేతల్లో అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ ఉన్నారు. జంతర్‌మంతర్ వద్ద ఆంక్షలను ఉల్లంఘించి జాతీయ జెండా ఎగరేశారనే కారణంతో వారిని అరెస్టు చేసి న్యాయ నిర్బంధానికి పంపినట్లు కథనంలో పేర్కొన్నారు. వారి పిటిషన్లపై విచారణ ఆలస్యం కావడంతో వారు జైలులోనే ఉన్నారు.

**"ఇతరుల కోసం నిలబడటమే గొప్ప లక్షణం"**

తమకు తెలియని వ్యక్తుల కోసం నిలబడటం, తమవి కాని పోరాటాలను చేపట్టడం, మరొకరికి మెరుగైన జీవితం లభించాలనే ఆశతో తమ దగ్గర ఉన్నదంతా పణంగా పెట్టడం మనిషికి ఉండగలిగే అత్యుత్తమ లక్షణమని అభిజీత్ దిప్కే పేర్కొన్నారు. అశుతోష్, సౌరవ్ అలాంటి వ్యక్తులని ప్రశంసిస్తూ తన పోస్టును ముగించారు.

## తనూజ రంజన్ హత్య కేసులో కీలక మలుపు!

- నేపాల్‌లో ప్రధాన నిందితురాలి ఆచూకీ
- విశ్రాంత ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసులో పోలీసుల పురోగతి
- దోచుకున్న నగలు, కుట్ర వెనుక ఇతరుల పాత్రపై దర్యాప్తు
- ఆరు నెలలుగా కొనసాగుతున్న గాలింపు చర్యలు



**కాకతీయ, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లో విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య తనూజ రంజన్ హత్య కేసులో కీలక పురోగతి సాధించినట్లు సమాచారం. ఆరు నెలలుగా గాలిస్తున్న హైదరాబాద్ పోలీసులు ప్రధాన నిందితురాలు కల్పన ఆచూకీని నేపాల్‌లో గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంపై పోలీసుల అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. 2026 మే 7 అర్ధరాత్రి తర్వాత తనూజపై దాడి జరిగినట్లు దర్యాప్తులో వెల్లడైంది. వినయ్ రంజన్ రే బెంగళూరులో ఉన్న సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న తనూజ ముఖంపై దిండు ఉంచి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు సమాచారం. అనంతరం నగలు, నగదు, విలువైన వస్తువులతో నిందితులు పరారయ్యారు. కుటుంబ సంరక్షకురాలిగా పనిచేసేందుకు వచ్చిన నేపాల్‌కు చెందిన కల్పన, ఇతర నిందితులతో కలిసి దోపిడీ పథకంలో భాగంగా హత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నేరం అనంతరం నిందితులు బీహార్ సరిహద్దుల మీదుగా నేపాల్‌కు చేరుకున్నట్లు భావిస్తున్నారు. కల్పన ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు రెండు నెలలపాటు నేపాల్‌లో మకాం వేసి గాలించినట్లు తెలుస్తోంది.

**ఇప్పటికే ఇద్దరి అరెస్టు**

ఈ కేసులో పోలీసులు ఇప్పటికే ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారిలో సునీల్ బహదూర్ ఔజీపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకుని జైలుకు తరలించినట్లు సమాచారం. ఇంట్లోని వ్యక్తుల కదలికలు, కుటుంబ సభ్యుల సమయాలను గమనించి అదును చూసి నేరానికి పాల్పడినట్లు దర్యాప్తులో గుర్తించారు. విధుల్లో నిర్లక్ష్యంపై కొందరు సిబ్బందికి ఛార్జిమెమోలు కూడా జారీ చేసినట్లు తెలిసింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నేతృత్వంలో కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. ప్రధాన నిందితురాలు కల్పనను విచారిస్తే హత్యకు సంబంధించిన పూర్తి కుట్ర, ఇతర నిందితుల పాత్ర, దోచుకున్న నగలు ఎక్కడికి చేరాయనే అంశాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. జూబ్లీహిల్స్ వంటి ప్రాంతంలో జరిగిన ఈ ఘటన అప్పట్లో నగరంలో సంచలనం సృష్టించింది. నిందితులందరినీ పట్టుకుని తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## సంక్షేమ పథకాలపై సీఎం, మధుయాష్కీ చర్చ!

- ప్రభుత్వ ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్లడంపై సమాలోచన
- రూ.8 లక్షల కోట్ల అప్పుల వడ్డీ భారంపైనా చర్చ
- ఏఐపీసీ బలోపేతానికి సహకరిస్తా: సీఎం రేవంత్‌రెడ్డి



**కాకతీయ, హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎంపీ, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) చైర్మన్ మధుయాష్కీగౌడ్ చర్చించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని ఎంసీహెచ్ఆర్‌డీఐలో మధుయాష్కీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఐపీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సుమారు గంటన్నరపాటు సమావేశమై రాష్ట్ర పరిస్థితులు, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై సమాలోచనలు జరిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు, రైతులకు రుణమాఫీ, సన్న వడ్లకు రూ.500 బోనస్ వంటి పథకాల అమలు తీరును ప్రజలకు వివరించాల్సిన అవసరంపై చర్చించారు. ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు, స్కిల్ యూనివర్సిటీ ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనతోపాటు ఫ్యూచర్ సిటీ నిర్మాణం ద్వారా కొత్త కంపెనీలు, ఉద్యోగ అవకాశాల కల్పన వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఏర్పడి త్వరలో మూడేళ్లు పూర్తికానున్న నేపథ్యంలో ఇప్పటివరకు సాధించిన పురోగతిని వివరించడంతోపాటు సంక్షేమ పథకాల అమలుపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని చర్చించినట్లు సమాచారం. వివిధ సంస్థల పనితీరును సమీక్షించి ప్రగతి నివేదికలు తీసుకుంటున్న తరహాలోనే ప్రభుత్వ శాఖలు, పథకాల అమలుపైనా నివేదికలు తీసుకోవాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపైనా చర్చ**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఫీజు రీయింబర్స్‌మెంట్, గత ప్రభుత్వ హయాంలో చేసినట్లు పేర్కొన్న సుమారు రూ.8 లక్షల కోట్ల అప్పులపై వడ్డీ భారం వంటి అంశాలు సమావేశంలో చర్చకు వచ్చినట్లు సమాచారం. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న తీరును వివరించడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇరువురు అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ఏఐపీసీని బలోపేతం చేసేందుకు తనవంతు సహకారం అందిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. వివిధ రంగాలకు చెందిన నిపుణులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ప్రభుత్వ విధానాలు, ప్రజా సమస్యలపై సమర్థవంతమైన చర్చలు నిర్వహించేలా ఏఐపీసీని తీర్చిదిద్దడంపై చర్చించారు. నిపుణుల సూచనలు, నివేదికలను వినియోగించుకుని కొత్త విధానాల రూపకల్పనలో వారి సేవలను సద్వినియోగం చేసుకుంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని రేవంత్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్ అభిప్రాయపడ్డారు.

## తల్లి దాడిలో తొమ్మిదేళ్ల బాలిక మృతి!

- కోదాడలో విషాద ఘటన..
- రాయితో దాడి చేసినట్లు ప్రాథమిక సమాచారం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**కాకతీయ, కోదాడ:** సూర్యాపేట జిల్లా కోదాడలో విషాద ఘటన చోటుచేసుకుంది. తల్లి సైరాబాను దాడిలో తొమ్మిదేళ్ల బాలిక జాస్మిన్ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. ఆడుకుంటున్న చిన్నారిపై రాయితో దాడి చేసినట్లు ప్రాథమిక సమాచారం. తీవ్ర గాయాలపాలైన బాలికను ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. సైరాబానుకు మానసిక సమస్యలు ఉన్నట్లు బంధువులు తెలిపినట్లు సమాచారం. భర్తకు దూరంగా తల్లి, కుమార్తె బంధువుల ఇంట్లో ఉంటున్నట్లు తెలిసింది. బాలిక మేనమామ ఫిర్యాదు మేరకు కోదాడ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకునేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## రాజేశ్వరి దేవికి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు



**కాకతీయ, కరీంనగర్:** శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా కరీంనగర్ సమీపంలోని అలుగునూరు వద్ద ఉన్న శ్రీ రాజేశ్వరి దేవి ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు.

## లక్నవరం చెరువులో నీళ్లు నిల్

**నీరు లేక బోసిపోయిన చెరువు**



**కాకతీయ, గోవిందరావుపేట:** పర్యాటక ప్రాంతంగా పేరొందిన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం చెరువు నీళ్లు లేక బోసిపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు పంటలకు సాగునీరు అందించే చెరువులో ప్రస్తుతం నీరు లేకపోవడంతో దాని కింద సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు మోటార్లతో నీటిని తోడిపోస్తున్నా ఎండల తీవ్రతకు భూమిలో తడి నిలవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు విద్యుత్ కోతలు వారి కష్టాలను మరింత పెంచుతున్నాయి. మూడు ఎకరాల్లో పంట సాగు చేసినా కనీసం ఒక్క ఎకరాన్ని కాపాడుకోవడం కూడా కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారు. పంటల కోసం అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, తీరా పంట చేతికొచ్చే సమయంలో నీరు లేక ఎండిపోతుండటంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని కన్నీటిపర్యంతమవుతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నారు. లక్నవరం చెరువులో నీటి నిల్వలు తగ్గిపోవడంతో సాగునీటిపై ఆధారపడిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

## పేదలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యం

- 224 మంది మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ
- స్వయం ఉపాధితో మహిళలకు ఆర్థిక భరోసా
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్

**కాకతీయ, నెల్లికుదురు:** పేద, బడుగు, బలహీన వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తన వంతు సహకారం అందిస్తానని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. సోమవారం నెల్లికుదురు, ఇనుగుర్తి మండలాలకు చెందిన 224 మంది మహిళలకు జీజేసీ గ్రౌండ్‌లో కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు చందు రాజ్‌కుమార్ యాదవ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ హెచ్‌సీఎల్ కంపెనీ సహకారంతో నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో కుట్టు మిషన్లు అందించినట్లు తెలిపారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థికంగా ఎదిగేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు. సాధ్యమైనంతవరకు ప్రజా సేవకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉత్తరం కాకతీయ



# కేసముద్రం రహదారిపై సెంటర్ లైటింగ్ వెలుగులు

**కాకతీయ, కేసముద్రం:** మహబూబాబాద్ జిల్లాలో నూతనంగా ఏర్పడిన కేసముద్రం మున్సిపాలిటీలో సెంటర్ లైటింగ్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. రహదారి విస్తరణ, డివైడర్ల ఏర్పాటు అనంతరం మధ్యలో ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్‌ను అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వేంనరేందర్‌రెడ్డి కృషితో రహదారి విస్తరణ, డివైడర్ల ఏర్పాటు పనులు చేపట్టినట్లు స్థానికంగా పేర్కొంటున్నారు. పండుగ వేళ రాత్రిపూట పట్టణ రహదారులు విద్యుత్ దీపాల వెలుగులతో కొత్త శోభను సంతరించుకున్నాయి. సెంటర్ లైటింగ్ ట్రయల్ రన్‌తో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు

- ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్




**కాకతీయ, హనుమకొండ:** వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆకాంక్షించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం బాలసముద్రంలోని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ప్రార్థించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, ప్రజాసేవలో మరింత ఉత్సాహంగా ముందుకు సాగాలని అమ్మవారిని వేడుకున్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, తెలంగాణ అభివృద్ధి, ప్రజల ఆకాంక్షల సాధనకు పార్టీ నాయకత్వానికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీక అని, ధర్మం, న్యాయం, సత్యం ఎప్పటికైనా విజయం సాధిస్తాయని ఈ పండుగ చాటిచెబుతుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, యువత, మహిళలు, వ్యాపారులు సహా అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలని ఆకాంక్షించారు. ప్రజలంతా పరస్పర ప్రేమాభిమానాలతో, సోదరభావంతో పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ 1వ డివిజన్ అధ్యక్షుడు నరెడ్ల శ్రీధర్, నాయకులు రవి, రాజేష్, అశోక్, అనిల్ పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా టపాసుల నిల్వ

- రూ.4.22 లక్షల సరుకు స్వాధీనం
- నివాస గృహంలో భారీగా బాణసంచా నిల్వ
- టాస్క్‌ఫోర్స్ దాడిలో వెలుగులోకి అక్రమ నిల్వ
- హసన్‌పర్తి టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో వ్యాపారి కత్తి రంజిత్



**కాకతీయ, హసన్‌పర్తి :** అనుమతులు లేకుండా నివాస గృహంలో భారీగా బాణసంచా నిల్వ చేసిన వ్యాపారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి రూ.4,22,067 విలువైన టపాసులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు అక్టోబర్ 19న హసన్‌పర్తి మండలం నాగారం గ్రామంలోని కత్తి రంజిత్ (38) ఇంటిపై టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసింది. నివాస ప్రాంతంలోని ఇంట్లో సంబంధిత అధికారుల నుంచి అనుమతులు, లైసెన్స్ పొందకుండా, అవసరమైన భద్రతా చర్యలు తీసుకోకుండా వివిధ రకాల బాణసంచా నిల్వ చేసినట్లు గుర్తించారు. తనిఖీల్లో రాకెట్లు, పూల కుండీలు, చక్రాలు, తారాజువ్వలు, మల్టీషాట్ టపాసులు, బాంబులు సహా పలు రకాల బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 130 ప్యాకెట్ల క్యాట్ బాంబుల విలువ రూ.76,700గా ఉంది. మొత్తం స్వాధీనం చేసుకున్న బాణసంచా విలువ రూ.4,22,067గా పోలీసులు వెల్లడించారు. అనంతరం నిందితుడు కత్తి రంజిత్‌తో పాటు స్వాధీనం చేసుకున్న బాణసంచాను తదుపరి చర్యల నిమిత్తం హసన్‌పర్తి పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో ఏసీపీ ఏ. మధుసూధన్, ఇన్‌స్పెక్టర్ వి. క్రాంతికుమార్, ఎస్సైలు కె. సుధాకర్, బి. ఉప్పలయ్య, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాన్సువాడ దసరా వేడుకల ఏర్పాట్ల పరిశీలన

**కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పోచారం భాస్కర్‌రెడ్డి**



**కాకతీయ, బాన్సువాడ:** విజయదశమి సందర్భంగా ఈ నెల 20న బాన్సువాడ పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో నిర్వహించనున్న దసరా వేడుకలు, రావణ కాష్ఠ దహన కార్యక్రమ ఏర్పాట్లను ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పోచారం భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా బాన్సువాడ పట్టణ డీఎస్పీ విఠల్‌రెడ్డి, పట్టణ సీఐ శ్రీధర్‌రెడ్డితో కలిసి కార్యక్రమ నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లపై సమీక్షించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాల కల్పన
- కేసముద్రం మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న



**కాకతీయ, కేసముద్రం:** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు సర్కిల్ (ఆర్ అండ్ బీ ఫ్లైఓవర్), జ్యోతిరావు పూలే సెంటర్ వద్ద చేపడుతున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్మన్ అల్లం రమ నాగేశ్వరరావు, పోలీసు అధికారి క్రాంతి కుమార్, వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. దసరా వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రజల భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యమిస్తూ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు.

# తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం

- దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంచాలి
- నవంబర్ నుంచి సీతమ్మసాగర్ పనులు ప్రారంభించాలి
- నీటి లభ్యతను బట్టే పంటలు సాగు చేయాలి : మంత్రి తుమ్మల



**కాకతీయ, భద్రాద్రి కొత్తగూడెం :** రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వను పెంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మూడు జిల్లాల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న జలాలను పొదుపుగా వినియోగించాలని సూచించారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించేలా సన్నద్ధం కావాలని, నవంబర్ నుంచి నిర్మాణ పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్టను పినపాక ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. దుమ్ముగూడెం ఆనకట్ట పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 0.8 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 0.5 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేసుకునే అవకాశం ఉందని తుమ్మల తెలిపారు. ఆనకట్ట వద్ద సుమారు ఒక మీటరు ఎత్తు వరకు ఇసుక బస్తాలు ఏర్పాటు చేసి నీటి నిల్వను పెంచే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఈ పనులను విజయదశమి రోజైనా ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సాంకేతిక అంశాలను పరిశీలించి, నీటి ప్రవాహం తగ్గకముందే పనులు పూర్తి చేయాలన్నారు. నీటి నిల్వ పెంపుతో మూడు జిల్లాల తాగునీటి అవసరాలను మరింతకాలం తీర్చవచ్చని పేర్కొన్నారు. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, సరిపడా నీరు నిల్వ ఉన్నప్పుడే మిగులు జలాలను ఇతర అవసరాలకు వినియోగించాలని స్పష్టం చేశారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు ఇతర అవసరాలకు నీటి వినియోగాన్ని నియంత్రించాలని సూచించారు. రానున్న వేసవిలో వాతావరణ పరిస్థితులు, నీరు, విద్యుత్ లభ్యతపై ముందస్తు అంచనాలతో ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు.

**నవంబర్ నుంచి సీతమ్మసాగర్ పనులు**

సీతమ్మసాగర్ ప్రాజెక్టు అనుమతులు, న్యాయపరమైన అడ్డంకుల కారణంగా గత ఐదేళ్లుగా పనులు నిలిచిపోయాయని మంత్రి తెలిపారు. అవసరమైన అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సంప్రదింపులు జరుపుతోందన్నారు. ఈ నెలలో అనుమతులు సాధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అనుమతులు లభించిన వెంటనే నిర్మాణం ప్రారంభించేలా యంత్రాలు, సామగ్రి, సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని నిర్మాణ సంస్థకు సూచించారు. జిల్లా యంత్రాంగం, నీటిపారుదల శాఖ సమన్వయంతో పనిచేసి నవంబర్‌లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని తుమ్మల సూచించారు. ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.2-3 లక్షల వరకు పెట్టుబడి పెడుతున్న రైతులు, పంట చేతికొచ్చే సమయంలో నీరు, విద్యుత్, భూగర్భ జలాల కొరతతో నష్టపోకూడదన్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా కూరగాయలు, పప్పుదినుసులు వంటి తక్కువ వ్యవధిలో దిగుబడి ఇచ్చే పంటలను పరిశీలించాలని చెప్పారు. అధిక నీరు అవసరమయ్యే పంటల సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రజలు కూడా తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. నీటి నిల్వ పెంపు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, నీటిపారుదల శాఖ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వెల్‌నెస్ సెంటర్‌లో వైద్య సేవలు మెరుగుపరచాలి





- మందుల పంపిణీలో జాప్యం నివారించాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**కాకతీయ, హనుమకొండ :** వెల్‌నెస్ సెంటర్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, నిర్వహణను పటిష్ఠం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. సోమవారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలోని వెల్‌నెస్ సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డెంటల్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఫార్మసీ, ల్యాబ్ తదితర విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుస్మితను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపీ సేవలు అందిస్తున్న వైద్యులతో మాట్లాడి, రోగుల సంఖ్య, వైద్య సేవల నిర్వహణపై ఆరా తీశారు. ఓపీ సేవల కోసం వస్తున్న రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని డాక్టర్ సుస్మిత కలెక్టర్‌కు వివరించారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేయడంతో పాటు ఆసుపత్రి ప్రాంగణంలోని మరుగుదొడ్లను పరిశీలించారు. ఓపీకి వచ్చే రోగుల వివరాల నమోదు ప్రక్రియ, ఫార్మసీలో మందుల పంపిణీ విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మందులు తీసుకునేందుకు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోందని రోగులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రోగులకు వైద్యులు సూచించిన మందుల వివరాలను ఆన్‌లైన్‌లో త్వరగా నమోదు చేసి, మందుల పంపిణీని వేగవంతం చేయాలని ఆదేశించారు. డేటా ఎంట్రీలో జాప్యాన్ని నివారించేందుకు అదనపు కంప్యూటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించాలని, వెల్‌నెస్ సెంటర్‌లో పరిశుభ్రతతో పాటు నిర్వహణను మెరుగుపరచాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ములుగు గడ్డపై గులాబీ జెండా రెపరెపలాడాలి

- కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో పార్టీని బలోపేతం చేయాలి
- కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని దిశానిర్దేశం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు పిలుపు



**కాకతీయ, ఏటూరునాగారం :** కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో ములుగు గడ్డపై గులాబీ జెండా సగర్వంగా రెపరెపలాడేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు పిలుపునిచ్చారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం, గంగారం ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లక్ష్మణ్‌బాబును, ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలతను మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగూడెం మండలం గంగారం తదితర ప్రాంతాల్లో పార్టీ పరిస్థితులు, క్షేత్రస్థాయి పరిణామాలు, ప్రజల ఆకాంక్షలను జిల్లా అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం నాయకులు, కార్యకర్తలకు లక్ష్మణ్‌బాబు దిశానిర్దేశం చేస్తూ కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని పేర్కొన్నారు. కేసీఆర్ దూరదృష్టి, కేటీఆర్ నాయకత్వ పటిమ పార్టీకి మార్గదర్శకాలని అన్నారు. గంగారం, కొత్తగూడెం ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. రాజకీయ భేదాలను పక్కన పెట్టి ఐక్యంగా ముందుకు సాగుతూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని పిలుపునిచ్చారు. ములుగు జిల్లాలో గులాబీ జెండా మరింత బలంగా ఎగిరేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మండల పార్టీ అధ్యక్షుడు వేణు యాదవ్, గంగారం అధ్యక్షుడు సూరన్న, జిల్లా నాయకులు స్వామి సార్, ఈసం సమ్మయ్య, తిరుమలగండి సర్పంచ్ తాటి కృష్ణారావు, బానోతు నెహ్రూ నాయక్, బానోతు వీరన్న నాయక్, బాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జూకు పోటెత్తిన సందర్శకులు

- ఒక్కరోజే 20,483 మంది సందర్శన
- రైళ్లు, సఫారీ సేవలకు అదనపు ఏర్పాట్లు
- సందర్శకుల రద్దీకి అనుగుణంగా అధికారుల చర్యలు



**కాకతీయ, హైదరాబాద్:** దసరా సెలవుల నేపథ్యంలో హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్కుకు సందర్శకులు పోటెత్తుతున్నారు. ఆదివారం ఒక్కరోజే 20,483 మంది జంతుప్రదర్శనశాలను సందర్శించగా, ప్రస్తుత సెలవుల సీజన్‌లో ఇదే అత్యధిక సంఖ్యగా నమోదైంది. కుటుంబ సభ్యులు, పిల్లలతో పెద్ద సంఖ్యలో తరలిరావడంతో జూ ప్రాంగణంలో సందడి నెలకొంది. సందర్శకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు అదనపు టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేయడంతోపాటు భద్రతా సిబ్బందిని పెంచారు. ప్రవేశ ద్వారాలు, జంతువుల ఎన్‌క్లోజర్ల పరిసరాల్లో పర్యవేక్షణను ముమ్మరం చేశారు. సందర్శకులకు మెరుగైన అనుభూతి కల్పించేందుకు జూ ప్రాంగణంలో నడిచే రైళ్ల ట్రిప్పుల సంఖ్యను పెంచారు. సఫారీ సేవలు, బ్యాటరీ వాహనాల నిర్వహణను కూడా విస్తరించారు. ప్రస్తుతం జూలో 2,178 జంతువులు ఉండగా, వీటిలో 498 క్షీరదాలు, 1,352 పక్షులు, 320 సరీసృపాలు, 8 ఉభయచరాలు ఉన్నాయి. ఇటీవల జంషెడ్‌పూర్ జూతో జంతు మార్పిడి కార్యక్రమంలో భాగంగా మాండ్రిల్ కోతులను తీసుకొచ్చి, ఒక జత ఆఫ్రికన్ సింహాలను అక్కడికి పంపించారు. గత ఏడాది జామ్‌నగర్‌లోని రాధాకృష్ణ ట్రస్ట్ నుంచి మూడు జీబ్రాలను తీసుకొచ్చారు. దాదాపు 37 ఏళ్ల విరామం తర్వాత జూలో జీబ్రాలు చేరడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా వంతారా కేంద్రం నుంచి కంగారూలను తీసుకొచ్చే అవకాశాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.



# చెన్నారావుపేట పీహెచ్ సీలో రాష్ట్ర డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ

- ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి
- డైరెక్టర్ రవీంద్రనాయక్

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ పరిధిలోని చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ప్రజారోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ బి రవీంద్రనాయక్ ఆకస్మికంగా సందర్శించారు. సోమవారం పిహెచ్ సికి చేరుకున్న ఆయన గోపి విభాగం, ల్యాబొరేటరీ, ఫార్మసీ, మందుల నిల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫార్మసీలో మందులను క్రమపద్ధతిలో నిర్వహించాలని, రాబిస్ నివారణకు సీరం మరియు వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. వ్యాక్సిన్ కోల్డ్ చైన్ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని, ఐఎల్ ఆర్ ఉష్ణోగ్రతను రోజూ రికార్డు చేయాలని, వ్యాక్సిన్ వినియోగానికి ముందు ఎక్స్‌పైరీ తేదీని తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అనంతరం జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ప్రోగ్రాం అధికారులతో సమీక్ష నిర్వహించారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ వివరాలను పరిశీలించారు. హై రిస్క్ గర్భిణీలు, టిఫా స్కాన్ లో అబ్నార్మాలిటీస్ ఉన్నవారు, రక్తహీనత (ఎనీమియా) ఉన్న గర్భిణీలను నిరంతరం ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు. ఎన్ఎస్ వి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ప్రతి ఆరోగ్య సూచికలో మెరుగైన ప్రగతి సాధించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజారెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ ఐ ప్రకాష్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సాజిదా, డాక్టర్ ఇక్తిదార్ అహ్మద్, డాక్టర్ అరుణ్ జోషి, వైద్యాధికారి డాక్టర్ సరోజ, డిప్యూటీ జిల్లా విస్తరణ మీడియా అధికారి ఎస్ వెంకటేశ్వర్లు, సిహెచ్ ఓ, స్టాఫ్ నర్సులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266